
# సత్యవాక్కు




క్రైస్తవ మాస పత్రిక

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "స త్య వా ణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొందియున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 15 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి !!

**SATYA VANI**
(P.O. Box 80) Sambhamurthi St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియ జేయండి. ఇది అత్యవసరం ! !

Razan Electric Press, Kakinada.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone: 0884-73722

Editor: J.C. CHOATE

Managing Editor: JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 13 | ఆగష్టు 1992 | సంచిక 1


# సంపాదకీయము

## అష్డోదు భాష

### (The Language of Ashdod)

తన ప్రజలుగా యుండునట్లు దేవుడొక జనాంగమును లేపాడు. వారాయనను ఘనపరచుదురని, ఆరాధింతురని, సేవింతురని ఆయన భావించాడు. ఆ జనాంగములోనుండియే లోక పాపముల నిమిత్తము బలి యవుటకు తన ఏకైక కుమారుడైన క్రీస్తు పంపించబడతాడు.

దేవుడు తన ప్రజలను ఆశీర్వదించాడు. వారి కొరకు యుద్ధాలను జయించాడు. వారు పరిశుద్ధులుగా యుండాలని కోరాడు. వారి ఇరుగుపొరుగు దేశాల స్త్రీలను పురుషులను వివాహమాడ రాదని హెచ్చరించాడు. అట్లు వివాహమాడితే వారి ప్రభావము వలన వారు నిజ దేవునిని ఆయన చట్టాలను విడనాడే ప్రమాద మున్నదని ఆయన ఎరుగును. ఇశ్రాయేలీయుల చరిత్రను పాత నిబంధనలో మనం చదువు

నప్పుడు ఇది యేలాగు జరిగెనో గ్రహించ గలము. ఉదాహరణకు నెహెమ్యా 13:23-27లో కొందరు యూదులు అష్డోదు, అమ్మోనీ, మోయాబు సంబంధులైన స్త్రీలను వివాహ మాడినట్లు ప్రవక్త చెప్పుచున్నాడు: "వారి కుమారులలో సగము మంది అష్డోదు భాష మాటలాడువారు గాని యూదుల భాష వారిలో ఎవరికిని రాదు. అంతట నేను వారితో వాదించి వారిని శపించి కొందరిని కొట్టి వారి తలవెండ్రుకలను పెరికివేసి-మీరు వారి కుమారులకు మీ కుమార్తెలను ఇయ్యకయు, మీ కుమారులకైనను మీకైనను వారి కుమార్తెలను పుచ్చుకొనకయు ఉండవలెనని వారిచేత దేవుని పేరట ప్రమాణము చేయించితిని". ఇట్టి కార్యము చేసినందున సొలొమోను కేమి జరిగెనో అతడు ఉదాహరణగా వారికి తెలియజెప్పెను: "ఇట్టి కార్యములు జరిగించి ఇశ్రాయేలీయుల రాజైన సొలొమోను పాపము చేయలేదా? అనేక జనములలో అతనివంటి రాజు లేకపోయినను, అతడు తన దేవుని చేత ప్రేమింపబడినవాడై ఇశ్రాయేలీయు లందరిమీద రాజుగా నియమింపబడినను, అన్యస్త్రీలు అతని చేత సహా పాపము చేయించలేదా? కాగా ఇంత గొప్ప కీడు చేయునట్లును మన దేవునికి విరోధముగా పాపము చేయునట్లును అన్యస్త్రీలను వివాహము చేసికొనిన మీవంటి వారి మాటలను ఆలకింపవచ్చునా? అని" అతడడిగెను (నెహెమ్యా 13 : 23-27).

దేవుని ప్రజలు అన్యజనులను వివాహమాడుట వలన వారును, వారి పిల్లలును అష్డోదు భాష మరియు ఇతర భాషలను మాట్లాడుటకు మొదలిడిరని పై వాక్యభాగాన్ని బట్టి మనం గమనించుకోవచ్చును. వారి స్వంత భాషను సయితము వారు మరచి పోయిరి. తమ చుట్టూ యున్న ప్రజల ప్రభావము ఎంత త్వరగా ఇతరులపై పడతాదో మనం గమనించుకోవచ్చును. ఇట్టి సందర్భాలలో వారి ప్రభావము కీడుకే

గాని మేలుకు కాదు. ఇంకో మాటలో తమ చుట్టూయున్న అన్యాచారముల వలన దేవుని ప్రజలు దేవునికి సన్నిహితంగా యుండలేక పోయారు. ఆయన నారాధించే ఆసక్తిని కోల్పోయారు, ఆయన ఆజ్ఞలకు లోబడనొల్లకపోయారు. మనం ఈ లోకస్థులతో స్నేహం చేస్తే ఏమవునో యిదే ఒక గొప్ప ఉదాహరణగా మనకు కనబడుతుంది.

ఈనాడు కూడ క్రైస్తవులు, క్రీస్తు సంఘస్థులు, ఈ లోకస్థులను గాని మతశాఖల వారిని గాని పెండ్లాడునప్పుడు వారు నిజానికి అశాంతినే కోరుకొనుచున్నారు. క్రీస్తు సంఘానికి బయటనున్న వారిని వివాహమాడువారు, అట్టి వివాహాల్ని ఏర్పాటు చేయువారు సాధారణంగా బలహీనులైన సభ్యులు. లేకపోతే వారట్లు చేయరు. పెండ్లి విషయం వచ్చేసరికి కొందరు తమ ఆత్మీయ జీవితాన్ని సహితం బలి యిచ్చుటకు సంకోచించరు. ఇటువంటిది జరిగినప్పుడు ఆ కుటుంబస్థులు వారి బిడ్డలు దేవునినుండి, ఆయన సత్యమునుండి దూరంగా తొలగి పోయే ప్రమాద మున్నది. క్రైస్తవులు అవిశ్వాసులతో విజోడుగా ఉండకూడదని పౌలు చెప్పిన హెచ్చరికను గుర్తుంచుకొనవలెను (2 కొరింథీ 6:14-18).

వివాహమాడుటకు క్రీస్తుసంఘస్థులలో సరియైన సంబంధము కుదరకపోతే యేమి చేయాలి? వివాహాన్ని గూర్చిన యేర్పాట్లు జరుగకముందు అవతలివారిని క్రీస్తు సంఘస్థులనుగా మార్చడానికి క్రమంగా ప్రయత్నం చేయాలి. ఈ పద్ధతి అనేక సందర్భాల్లో విజయవంతమైనది. నిన్ను గూర్చి, నీవు వివాహమాడబోయే వ్యక్తి యొక్క ఆత్మను గూర్చి చింత కలిగియుంటే నీవీ పనిని తప్పక చేయగలవు.

వివాహ విషయాల్లోనే గాక మిగతా విషయాల్లో కూడ మన మిత్రుల ప్రభావం మనమీద పడవచ్చు. మతశాఖలవారి కంటే

క్రీస్తు సంఘ సభ్యులు అల్ప సంఖ్యాకులు గనుక వారి చదు వులలోను, జీవిత విధానములోను, పనిలోను మనం వారిని అనుక రించుటకు మొదలిడవచ్చు. నిజానికి వారు మనల్ని అనుకరించాలి. సత్యం విషయమై వారిని మనం ప్రభావితులనుగా చేయాలి గాని వారివలన మనం ప్రభావితులం కారాదు. అట్లు జరిగితే మనం అష్డోదు భాష మాట్లాడుచున్నట్లే యగును.

ఉదా: "మేము గుడికి వెళ్తున్నాము" అని క్రీస్తు సంఘస్థులు అనేస్తారు. ఈ మాటలు వారికి ఎక్కడనుండి వచ్చాయ్? మతశాఖల వారు వారి ఆలయాన్నే సంఘంగా (గుడిగా) సంభోధిస్తారు. సంఘం కూడుకొనే ఆలయం లేక భవనం ఒక సంఘం కాదు. గుడికి వెళ్తున్నా మంటే ఆరాధనకు వెళ్తున్నామని మా వుద్దేశం అని వారు చెబుతారు. అయితే సాతానుడు పనిచేసే విధానం మనం ఎరుగకపోతే కొంత కాలానికి సత్యాన్నుంచే దూరమైపోతాము.

యిది నా సంఘము, మా సంఘము అని చెప్పుకొనే మాటలు కూడ అష్డోదు భాషే. సంఘము నాకుగాని నీకుగాని, మరెవరికిగాని చెందినది కాదు. అది ఎల్లప్పుడు క్రీస్తుకు చెందినదే. క్రీస్తుయొక్క సంఘంలో సభ్యునిగా యుండుట నాకు దొరికిన గొప్ప భాగ్యమే (మత్తయి 16:18). ఆయన దానికొరకు చనిపోయాడు (ఎఫెసీ 5:25). దాని శిరస్సు ఆయనే (కొలస్స 1:18), దాని పునాది ఆయనే (1 కొరి 3 : 11); అందువలన అది ఎల్లవేళల ఆయన నామమును ధరించును (రోమా 16 : 16). గనుక అది నా సంఘమెట్లవుతాది? దాన్ని నేను స్థాపించలేదు, దాని కొరకు నేను చనిపోలేదు, దాన్ని నేను రక్షించనూ లేదు. దానిలో సభ్యులుగా యుంటూ దాన్ని క్రీస్తు సంఘమని సూక్ష్మంగా సంబోధిస్తే మనకు క్షేమము. అంటే అది క్రీస్తుయొక్క సంఘమని మన వుద్దేశం.

క్రీస్తు సంఘ క్రైస్తవులు, క్రీస్తుసంఘ సిద్ధాంతము, క్రీస్తు సంఘాచారము మొదలగు మాటలను మనం తరచు వింటాము. ఒకడు నిజంగా క్రైస్తవుడైతే అతడు క్రీస్తు సంఘస్థుడు. ఒకడు క్రీస్తు సంఘస్థుడైతే అతడు కేవలం క్రైస్తవుడు మాత్రమే. క్రీస్తుసంఘ బోధ, క్రీస్తు సంఘ సిద్ధాంతము అంటూ యేమీ లేదు. మనం చెప్పేది చెప్పవలసింది అంతా క్రీస్తు బోధ మాత్రమే (II యోహాను :9). ఈ పై విషయాల్లో మనం జాగ్రత్త వహించకపోతే అష్డోదు భాష మాట్లాడే ప్రమాదం మనకున్నది.

మతశాఖల భాష మాట్లాడటం మొదలుపెట్టామంటే యిక దానికి అంతు యుండదు. కొన్నాళ్ళకు వారివలెనే మనంకూడ ఒక మతశాఖలాగ తయారవుతాము. మతశాఖలవారితో సహవాసం చేయడం, వారిని సహోదరులని పిలవడం, మన కూటాలలో వారిని ప్రసంగించమనడం, అన్ని సంఘాలవారు ఒకటే యనుకోనడం... ఇట్టివన్నీ అష్డోదు భాషకున్న పర్యవసానాలే. మతశాఖలవారి ఏ సంస్థలోనైనా తర్ఫీదు పొందిన వారిని క్రీస్తు సంఘాల్లో బోధకులుగా, ఉపదేశకులుగా నియమించడం, ఈస్టరు, శ్రమకాలం, క్రిస్మసు మొదలగునవి ఆచరించడం అష్డోదు భాష మాట్లాడుటవలన కలుగు ఫలితాలే. ఈ భాష మాట్లాడువారు ఎంత గొప్పవారైనను అపవాది ఏజెంట్లు మాత్రమే గాని క్రీస్తు పరిచారకులు కాదు. మన స్నేహితులు మతశాఖల వారైతే, వారి అలవాట్లకు మనం తల ఒగ్గితే క్రమంగా మన ప్రత్యేకతను కోల్పోతాము, వారిలో ఒకర మవుతాము. చివరిగా బైబిలులో కనబడు సంఘముగా ఉండకుండ పోతాము.

ఇశ్రాయేలీయుల విశ్వాస భ్రష్టత్వము వలన వారికేమి సంభవించెనో మనం ఎరుగుదుము. ప్రభువునుండి ఆయన బోధనుండి తొలగిపోతే కలిగే ఫలితాన్ని గూర్చి పౌలు, పేతురు, క్రీస్తు చేసిన

హెచ్చరికలు మనకున్నాయి. అందువలన మనం అప్రమత్తంగా యుండుట అత్యవసరం. మనం సత్యాన్ని విని, విశ్వసించి దానికి లోబడేలాగున ప్రభువు సహాయం చేయునుగాక! మనం సత్యానికి లోబడినట్లయితే దానికి యేమీ కలుపనక్కర్లేదు, దానినుండి యేమీ తీసివేయనక్కర్లేదు.

---

## కయీను

"మనము కయీనువంటి వారమై యుండరాదు" (1 యోహా 3 : 12).

కయీను అనువాడు ఆదాము హవ్వల జ్యేష్ఠ పుత్రుడు. దేవుని చిత్తమునకు విరుద్ధంగా ప్రవర్తించుట అతని అభిమతము. ప్రతి విధమైన దుర్నీతికి కయీను, అతని సంతతివారు మూలపురుషులు. వారు ప్రదర్శించిన దుష్ చేష్టలు కొన్నింటిని ఈ దిగువ చూతము.

### దైవార్పణ—ఆరాధన

విశ్వాసమును బట్టి హేబెలు కయీనుకంటె శ్రేష్ఠమైన బలి దేవునికి అర్పించెను (హెబ్రీ 11:4). హేబెలువలె కయీను కూడా దేవునియందు విశ్వాసము గలవాడే, దేవుని కార్యములందు ఆసక్తి గలిగి హేబెలుతోపాటు దైవ కార్యములందు పాల్గొనువాడే. అయితే కయీనులో గల ప్రత్యేకత ఏమి? యెహోవా చిత్తమును శ్రద్ధగా తెలిసికొని దేవునికి ప్రీతికరమగు కార్యమును చేయుటలో జాగ్రత్త వహించక తన మనసుకు తోచినట్లు చేసి దేవునికి ఇష్టుడు కాగోరేవాడు. దేవుని నీతి నెరుగక తన స్వనీతిని స్థాపింప పూనుకొనుచు దేవుని నీతికి లోబడలేదు (రోమా 10:3).

అందుచే కయీను దేవుని యెదుట నీతిమంతుడుగా తీర్చబడుటకు అవసరమగు రక్త ప్రోక్షణయందు శ్రద్ధ చూపక తనకు కలిగిన పొలవు పంటతోనే దేవుని యెదుట పాపక్షమాపణ పొంది, నీతిమంతునిగా తీర్పు పొందాలని ఆశించాడు. గాని ఆ అర్పణ విశ్వాస మూలమైనది కానందున అనగా తన విశ్వాసము దేవుని మాట వినిన ప్రకారమైనది కానందున అది అతనికి పాపమై శాపమునకు దారి తీసెను (రోమా 14:23).

ఈ దినాల్లోకూడ పాపక్షమాపణ కొరకు బాప్తిస్మము పొందవలెనని దైవోక్తి పలుకుచుండగా, రక్తప్రోక్షణకు వేరుగా పాపక్షమాపణ పొంద నాశించిన కయీనువలె బాప్తిస్మమునకు వేరుగా రక్షణ పొందాలని కోరుచు, పొందామని కొందరు మోసపోవుచున్నారు అని చెప్పుటకు విచారించుచున్నాము. కయీను దేవునికి ప్రీతికరమైన రీతిలో దేవుని సన్నిధికి చేరలేకపోయాడు, ప్రీతిగల అర్పణతో ఆరాధించలేక పోయాడు. కయీనువలె దైవనియమములను అలక్ష్యము చేయుచున్న కారణము వలననే క్రీస్తు సంఘమని చెప్పుకొనుచు మానవకల్పిత సిద్ధాంతములగు క్రిమి కాలకూటములను ఆచరిస్తూ, ఏమత శాఖవారైన అనుభవముగల బోధకులను క్రీస్తు సంఘ బైబిలు స్కూలు నందు అధ్యాపకులుగా అంగీకరించుటయు వంటి కార్యాలు చేయుచున్నారు. క్రీస్తు బోధయందు నిలిచి యుండవలెనని అట్టి వారిని కోరుచున్నాము. మనము కయీను వంటివారమై యుండరాదు.

## మిక్కిలి కోపము

తన క్రియలు చెడ్డవియు తన సహోదరుని క్రియలు నీతిగలవియు అయినందున కయీనుకు తన తమ్మునిపై మిక్కిలి కోపము

వచ్చెను. తమ్ముని మంచి పనిని చూచి ఓర్వలేక పోయాడు. దేవుని మెప్పు పొందిన హేబెలును చూచిన కయీను అసూయతో కలత చెంది కలహము రేపి కడకు తమ్ముని ప్రాణము తీసాడు.

అయ్యో వానికి శ్రమ, గొర్రెపిల్ల రక్తము చిందించి పాప క్షమాపణ పొందుటకు బదులు అసూయతో తమ్ముని రక్తము చిందించి శాపము తెచ్చుకొన్నాడు. కయీను తన రక్త సంబంధి, తన సొంత తమ్ముని దైవకార్యాన్ని చూచి సంతోషించి, సహకరించి, అనుసరించి, ఆశీర్వాదం పొందలేక పోయాడు.

అవును నేటి రక్త సంబంధులలోను సంఘ సహవాసములోను అనేకమంది కయీనులు కార్యకర్తలుగా ఉన్నందున, కుటుంబాలలో కలహములు, సంఘాలలో సహవాసలోపము, సేవకులలో చీలికలు ఏర్పడుచున్నవి. అనేక శ్రమలతో స్వచ్ఛందసేవ చేయుచు సత్యవాక్యము నేర్పి సంఘములను సమకూర్చుచున్న ప్రాంతాలలో సత్యమును నిర్లక్ష్యము చేసి డబ్బు సంచిని ఎరచూపి సేవకులను, సంఘములను స్వాధీనపర్చుకొను చున్నారు, వారి మధ్య చీలికలు సృష్టించుచున్నారు. ఇది నాబోతు ద్రాక్షతోటను అక్రమముగా ఆక్రమింప చూచిన అహాబు చర్యకు తీసిపోదు (1 రాజు 21:1-16). అయినను వారు వాత వేయబడిన మనస్సాక్షితో కయీనువలె తమ సహోదరుల పని తమదన్నట్లు చిత్రించుకొని కష్టించి పనిచేసిన తమ సహోదరుల నామరూపాలే లేకుండా వారి పరిచర్యను హత్య చేయుచున్నారు.

ఆనాటి కయీను ఏకాకిగా తన సహోదరునిపై కక్ష సాధింపపూనెను గాని ఈనాటి ఈ కయీనులు కొంత సమూహమును సమకూర్చుకొని సత్యమార్గానికి అడ్డు తగులుచున్నారు. ఆ కయీను

వెంటనే తీర్పు పొందెను గాని ఈ కయీనులు మారుమనస్సు పొంద వలెనని దేవుడు ఓర్పుతో అవకాశ మిచ్చుచున్నాడు. మనము కయీనువంటి వారమై యుండరాదు.

## బహుభార్యా తత్వము

బహు భార్యలుగల కుటుంబము కయీను సంతతిలోనే మొదలయ్యింది.

"లెమెకు ఇద్దరు స్త్రీలను పెండ్లి చేసికొనెను" (ఆ.కా. 4:19).

ఇది దేవుని పవిత్ర సృష్టిలోని పవిత్ర కుటుంబ జీవితమునకు భిన్నమైనది. ఇట్టి నీతి విరోధ చర్య ఇశ్రాయేలీయులు కూడా అవలంభించినను దేవుడు సహనముతో ఆ అజ్ఞాన కాలములను చూచి చూడనట్లుండెను గాని ఇప్పుడైతే అందరును అంతటను మారుమనస్సు పొందవలెనని దేవుడు కోరుచున్నాడు. "మనము కయీనువంటి వారమై యుండరాదు".

## వాద్యముల వాడుక

నేటి దినాలలో వాయించే వాద్యాలకు కూడా మూలము కయీను సంతతియే. "...ఇతడు సితారాను సానికను (పిల్లనగ్రోవి) వాడుక చేయువారందరికిని మూలపురుషుడు" (ఆ.కా. 4:21).

దేవునియందు భయభక్తులు కలిగి దేవుని మార్గములో నడుచువారందరు పాటలతోను, కీర్తనలతోను గీతములతోను దేవుని స్తుతించి, ఆరాధించాలనియే దేవుడు కోరుచున్నాడు. అలాగే దేవుని సన్నిధిలో స్తుతిగానము చేయుచూ కృతజ్ఞతలు తెలియజేయవలెనని మానవుడు కూడా ఆశ కలిగి ఉన్నాడు. అట్లు చేయుట దేవుని చిత్తమే.

దేవుడు మానవుని నుండి ఏ స్వరము వినగోరుచున్నాడు? మానవుడు దేవునికి వినిపింపజేసే స్వరము ఏది? నిర్జీవ నాదమా లేక సజీవ నాదమా? కయీను సంతతి తయారుచేసిన నిర్జీవ వస్తువులనుండి వినబడు నాదము (1 కొరి 14 : 7) నిర్జీవ నాదము. అయితే దేవుడు వినగోరునది జీవస్వరము. దాని హృదయములలో నుండి గానము చేయుచు జిహ్వా ఫలములతో స్తుతియాగము చేయాలి అని దేవుడు కోరుచున్నాడు. హెబ్రీ 13:15; కొల 3:16, ఎఫె 5:19 చదివినచో హృదయములలో నుండి సంగీత నాదములు వెలువడాలని దేవుడు సెలవిచ్చుచున్నాడు. అందుచే క్రొత్త నిబంధన ఉపదేశ క్రమ మందు పాటలు, లేక కీర్తనలు పాడిరి. కీర్తనలు పాడుడి, నేను పాడు దును అని వ్రాయబడెను గాని వాయిద్యాల సంగతి వ్రాయబడలేదు.

అయితే పాతనిబంధన కాలపువారు వాయిద్యాలతో పాడి గదా అనవచ్చు. అవును వారు దానికి అనుమతి దేవునినుండి పొంద లేదు గాని కయీను సంతతి నుండి మాత్రమే వారు పొందిరి. అయి నను, బహుభార్యత్వమును సహించినట్లే ఈ వాయిద్య స్వరమున కూడా సహించి, క్రీస్తు శరీరమను తన సంఘములో అట్టి నిర్జీవ నాదమునకు చోటు నివ్వలేదు.

మరియు దేవుడు ఈ విషయములో ప్రవక్తలద్వారా పితరులతో స్పష్టంగా చెప్పిన విషయాన్ని చదవండి: "మీ పాటల ధ్వని నా యొద్దనుండి తొలగనియ్యుడి. మీ స్వరమండల నాదము వినుటకు నాకు మనస్సు లేదు..."(ఆమో 5:23).

ఈ మాటకు కొందరు అలాగైతే దావీదు ఎందుకు వాయి చెను? వాయిద్యములు అక్కరలేని యెడల నూటయాబది కీర్తనలు బైబిలులో వ్యర్థమే అంటున్నారు. ఈలాంటి మాటలు చెప్పుకొను వారు ఏమిచేయుదురని దేవుడు చెప్పాడో గమనించండి: "వారు స్వర

మండలములతో కలిపి పిచ్చిపాటలు పాడుచు, దావీదువలెనే వాయించు వాయిద్యములను కల్పించుకొందురు" (ఆమో 6 : 5).

## ఏమంటారు ?

దేవునికి ప్రీతికరమైన మానవ స్వరపేటిక నుండి జిహ్వాఫలములు సజీవ స్వరముతో వినిపింప గోరుదురా? లేక దేవుడిచ్చిన జీవపు స్వరాన్ని కలుషితముచేయు స్వరమండల వాయిద్యనాదమును వినియోగించి, హృదయములలో నుండి వెలువడు స్తుతి గీతాలను కలుషితపర్చు కొందురా! మిశ్రిమ స్వరముతో ఆరాధింతురా అమిశ్రిమముగా ఆరాధింతురా? కయీనుకు, వాని సంతతికి సంపూర్ణమైయున్న దేవుని చిత్తమునకు విధేయత చూపుట ఎంతమాత్రము గిట్టదు. అందుచే వాళ్ళు అర్పణను కలుషితముచేయు పొలపు పంటను, పవిత్ర హస్త జీవితమును కలుషితపర్చుటకు బహుభార్యలను, దైవ ఆరాధనలోని స్తుతి గీతాలను హృదయనాదములను, జిహ్వాఫలములను కలుషితపర్చుటకు నిర్జీవనాదము నిచ్చు సితార, పిల్లనగ్రోవులను సానికను చేసెను. "అయ్యో వారికి శ్రమ".

ప్రభువైన యేసుక్రీస్తు నామముద్వారా తండ్రియైన దేవునికి మహిమ కలుగునుగాక. క్రీస్తు సంఘములలో ఆలాటి కలుషిత వాతావరణము ఏర్పడకుండా జాగ్రత్త వహించుచూ క్రొత్త నిబంధన లేఖనములను శ్రద్ధతో పరిశీలించి ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మారిన మనస్సులతో రూపాంతరము పొందుచున్నారు (రోమా 12:2).

అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది దైవ కృప కలిగియుందము. ఆ కృప కలిగి వినయ భయభక్తులతో దేవునికి

ప్రీతికరమైన సేవ చేయుదము. ఏలయనగా మన దేవుడు దహించు అగ్నియై యున్నాడు (హెబ్రీ 12:29).

—పాల్ గూటం, గొల్లవిల్లి.

—o—

## ఏది నిజమైన సంఘము ?

ప్రియ సోదరులారా ఏది నిజమైన సంఘమో మనము తెలుసుకొనుట మంచిది. ఎందుకనగా నేడు అనేకులకు నిజ సంఘమునుగూర్చి తెలిసికొను ఆసక్తి లేదు. కాని సంఘమునుగూర్చి తెలుసుకొను అవసరము ప్రతి ఒక్కరికి కలదు. ఈనాడు మన పట్టణములలో, గ్రామములలో కన్పించు మతశాఖలకును, క్రీస్తు సంఘమునకును చాలా వ్యత్యాసము కలదు. సంఘమంటే నాలుగు గోడలు లేక తడికెల కలయిక కాదు. మనము సంఘముయొక్క విలువ, శక్తి, తెలిసికొనవలెను.

### పిలువబడినవారు

సంఘమనగా పిలువబడినవారు, అంటే పాపమునుండి బయటకు పిలువబడినవారు. ఇది (Ekklesia) ఎక్లేషియా అను గ్రీకు పదము నుండి పుట్టినది. సర్వమానవులను పాపమునుండి విడుదల చేయుటకై దేవుడు ఒకేఒక్క సంఘమును కట్టుదునని వాగ్దానము చేసెను (మత్తయి 16 : 18). ఆశీర్వాదమునకు వారసులవుటకు మీరు పిలువబడితిరని అపొస్తలుడైన పేతురు పలికెను (1 పేతురు 3:9). "ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు; ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు"! సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు (కొలస్స 1 : 17-18). సంఘమువట్ల క్రీస్తుకున్న బాధ్యత, దానికొరకు ఆయన చేసిన త్యాగమును గూర్చి గ్రహించిన అపొస్తలుడైన పౌలు ఇట్లు

నను: "సంఘము అను ఆయన శరీరముకొరకు క్రీస్తు పడిన పాట్లలో కొదువైన వాటియందు నావంతు నా శరీరమందు సంపూర్ణముచేయు చున్నానననను" (కొలస్స 1 : 24). మనలను క్రీస్తు ఒక్క శరీరముగా పిలచెను. సంఘమనే శరీరమునకు క్రీస్తే శిరస్సయి యున్నాడు (ఎఫెసీ 5:22). ఆ శిరస్సు (క్రీస్తు) మూలముగా సర్వశరీరము కీళ్ళచేతను నర ములచేతను పోషింపబడి అతుకబడినదై దేవుని వలన కలుగు వృద్ధితో అభివృద్ధి పొందుచున్నది (కొలస్స 2:19).

## రక్షించబడినవారు

మొదటి శతాబ్దములో రక్షించబడినవారిని అనుదినము (క్రీస్తు) సంఘముతో చేర్చుచుండెను. ఆనాటినుండి ఈనాటివరకు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము క్రీస్తుసంఘముతో చేర్చు చున్నాడు (అ.పొ.కా. 2:47, ఎఫెసీ 2:21). సంఘమునకు వెలుపట ఎవరునూ రక్షింపబడలేరు. ఎందుకనగా ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నాతండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును (మత్తయి 7:21). ఒకడు దైవ చిత్తాన్ని అనుసరించి ఆయన సంఘ ములో ఉన్నప్పుడే రక్షణ కలదు. ఎందుకనగా సంఘముద్వారా తనయొక్క నానావిధమైన జ్ఞానము తెలియబడవలెనని దేవుని ఉద్దేశ్యం (ఎఫెసీ 3 : 11). నేడు అనేకులు యేసుప్రభువును ఒక సంఘ సంస్క ర్తగాను, ఒక నిమ్నజాతి పురోభివృద్ధి చేయుటకు పుట్టిన నాయకుని గాను, మరికొందరు ప్రవక్తగాను, మరికొందరు దైవ అవతారములలో ఒక అవతారిగా పరిగణించుట చాలా అవివేకం. యేసుప్రభువు పాపు లను రక్షించుటకొరకు సిలువపై మరణించి, సమాధి చేయబడి తిరిగి మృత్యుంజయుడై క్రీ॥శ॥ 33లో యెరూషలేములో పెంతెకోస్తు అను పండుగ దివమున తను వాగ్దానము చేసిన రీతిగా మూడు వేలమందితో

సంఘమును అంటే క్రీస్తు సంఘమును స్థాపించెను. అంతేకాని నేడు కన్పించు కేథలిక్, లూథరన్, ఎపిపానియా, యబ్బోకు, పెంతుకోస్తు, గ్రేస్‌లాండ్, హెల్పింగ్ హేండ్, ఫెలోషిప్, మెథడిస్ట్, సెవెంత్ డే ఎడ్వెన్‌టిస్ట్, బాప్టిస్ట్ అను పేర్లు గల సంఘములను స్థాపించలేదు. అది ఒకేఒక నామమును అందలి విశ్వాసులు కూడా ఒకే నామమును కల్గియుండిరి (అపొ.కా. 11:26, 26:28; 1 పేతురు 4:15-16, యాకోబు 2:7, కొలస్స 1:18).

క్రీస్తు సంఘము లన్నియు ఒకే ఐక్యత కల్గియున్నవి. క్రీస్తే సంఘమునకు అధినేత. ఆయనే రాజు. అది ఆయన భువిలో నెలకొల్పిన ఆత్మీయ రాజ్యము. మరి ఇటువంటి నిత్యజీవముగల సంఘములో ఇంకనూ నీవు సభ్యుడవు కాకపోయినట్లయితే జాప్యముచేయక, మీ సమీప క్రీస్తు సంఘమును దర్శించి వాక్యం విని, విశ్వసించి, మారు మనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొంది నిజమైన సంఘములో భాగస్వాముడవు కమ్ము. అప్పుడు క్రీస్తు సంఘములో నీకు ఆశీర్వాదములను క్రీస్తు అనుగ్రహించును. క్రీస్తు సంఘము లన్నియును మీకు వందనములు చెబుచున్నవి (రోమా 16:16).

—పి. చంద్రశేఖర్,
క్రీస్తు సంఘం, ధవళేశ్వరం-533 12

—o—

## "రక్త ప్రోక్షణం పాప వినాశం"

సర్వ సాధారణంగా మన గ్రామాల్లో కొలువులు జాత జరిగేటప్పుడు జంతు బలు లర్పించడం చూస్తూంటాం. వారివారి శా తును బట్టి కొందరు మేకలను, ఎడ్లను, పొట్టేళ్ళను, కోళ్ళను బలి అర్పిస్తుంటారు. మా ప్రాంతంలో ప్రకృతి శక్తుల నారాధిం

తెగ ఒకటి ఉంది. వారు ఏ మతానికి చెందరు. వారికి ఒక దేవుడంటూ లేడు. వీరిని "పేగన్స్" అంటారు. ప్రతి ముఖ్యమైన పనికి ముందు బలు లర్పించడం ఈ తెగల కన్పిస్తుంది. వరి పొలాల్లో నాటు వేసే ముందు వీరి నాయకుడు పొలాలున్న ప్రాంతానికి వెళ్ళి, ఒక కోడిని తలత్రెంచి కారే రక్తాన్ని పొలాల గట్లచుట్టూ పోత్తిస్తాడు. అలా అర్పిస్తే వీరు చేసిన పాపాలు క్షమింపబడి, పంటలు విరివిగా పండి, ఫలం సమృద్ధిగా లభిస్తుందని వీరి నమ్మకం. ఏ ప్రాంతమైనా, ఏ తెగ యైనా బలులర్పించి, రక్తం చిందించడంలో నమ్మకం, గూడార్థం "పాపాలు క్షమించబడ్తాయనే".

సమస్త మానవాళి పాప విమోచనార్థం, మన ప్రభువును, రక్షకుడైన యేసుక్రీస్తు తన శరీరాన్ని ఒక్కసారియే అర్పించుట, ఆ ఒక్క అర్పణ చేత (హెబ్రీ 10 : 10, 14) అనగా క్రీస్తు సిలువపై చిందించిన పవిత్ర రక్తం యావత్ మానవకోటి పాపక్షమాపణ నిమిత్తమేనని తెలియక పోవుటే, ఇప్పటికి కొనసాగుతున్న జంతు బలులకు కారణం.

పాతనిబంధన కాలంలో మానవ పాప ప్రాయశ్చిత్తం కొరకు జంతు బలులు, రక్త తర్పణ విధిగా అర్పించబడేవి. అంతేగాక "సంవత్సరమునకు ఒక్కసారి మాత్రమే ప్రధాన యాజకు డొక్కడే రక్తము చేత పట్టుకొని దేవాలయమందలి అతి పరిశుద్ధ స్థలములోనికి ప్రవేశించి, ఆ రక్తము తనకొరకును, ప్రజల అజ్ఞాత కృతముల కొరకును అర్పించెను" (హెబ్రీ 9:7). ఏ కళంకము లేని జంతువు లను పక్షులను బలిగా అర్పించినా అవి పశువులు పక్షులే కదా! వాటి రక్తంతో మనకు రక్షణ లభించదు. "ఏలయనగా ఎడ్ల యొక్కయు, మేకల యొక్క రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము" (హెబ్రీ 10 : 4).

లోక పాపముల కొరకు చిందింపబడే రక్తం పాపరహితమై యుండాలి. సాతానుకు లొంగక, శోధనలను జయించగల్గిన జయశీలునిదై ఉండాలి. ధర్మశాస్త్రానుసారంగా ప్రవర్తించి ప్రజలకు మాదిరి చూపినదై ఉండాలి. ఏ ఒత్తిడులకు లోనుకాక, యిష్టపూర్వకంగా అర్పింపబడేదై ఉండాలి. ఈ సద్గుణాలన్నీ మేళవించిన వ్యక్తి క్రీస్తు యేసు తప్ప మరెవ్వరూ లేరు. క్రీస్తు పాపరహితుడు. ఆయన యందు ఏ పాపము లేదు. "ఆయన పాపము చేయలేదు. ఆయన నోటను ఏ కపటము కనబడలేదు" (1 పేతురు 2:22). క్రీస్తు సాతాను కుయుక్తులకు లొంగక శోధనలను జయించాడు (మత్తయి 4:1-11). ఆయన ధర్మశాస్త్రాన్ని తు.చ. తప్పక పాటించుటే కాక యిష్టపూర్తిగా బలియాగమైనాడు.

పశుపక్షాదుల రక్తం మనలను రక్షింపనేరదు. మన సత్క్రియలు, ధనధాన్యాలు, వెండి బంగారాలు మనలను రక్షింపవు ధర్మశాస్త్రం మనలను క్రీస్తునొద్దకు నడిపించగలదే కానీ, రక్షించలేదు (గలతీ 3:22-25). సాతానుని కఠోర, కరాళ సంకెళ్ళనుండి విడిపింపబడి, కోల్పోయిన మన సంబంధబాంధవ్యాలు తిరుగ దేవునితో సమాధానపర్చుకోవాలంటే క్రీస్తు రక్తములో పవిత్రపరచబడుట తప్ప వేరే మార్గము లేదు (కొలస్స 1:19-20). "యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1 : 7). అపొస్తలుడైన పౌలు ఎఫెసులోని క్రైస్తవుల నుద్దేశించి "మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తు యేసునందు, క్రీస్తు రక్తము వలన సమీపస్థులై యున్నారు" (ఎఫెసీ 2:13) అని చెప్పెను. క్రీస్తు తను అప్పగింపబడే ముందు శిష్యులతో "ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" (మత్తయి 26 : 28) అనెను. ఎఫెసీ పత్రిక 1:7లో "దేవుని కృపా

మహాదైశ్వర్యమును బట్టి ఆ ప్రియుని యందు ఆయన రక్తము వలన మనకు విమోచన అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కల్గియున్నది" అని పౌలు విశదపర్చాడు.

పాపక్షమాపణ నిమిత్తము, రక్షింపబడుటకు ఒక్కటే మార్గము. అది క్రీస్తు రక్తములో పవిత్రపర్చుటే జంతు బలులు మనలను రక్షింపవు. ధర్మశాస్త్రము రక్షింపలేదు. మన నీతి మనలను రక్షించదు. రక్షింపబడవలెనంటే దేవుని మాటలు విని గైకొనాలి (రోమా 10:17). విశ్వసించాలి (హెబ్రీ 11:6). మారుమనసుతో మార్పు చెందాలి (అ.కార్య. 17:30; లూకా 13:3). క్రీస్తు జీవముగల దేవుని కుమారుడని నమ్మి, యేసు ప్రభువని నోటితో ఒప్పుకోవాలి (మత్తయి 10 : 32; రోమా 10:9). పాపక్షమాపణ నిమిత్తం యేసుక్రీస్తు నామములో బాప్తిస్మము పొందాలి (అ.కార్య. 2:38; మార్కు 16:16). ఈ విధముగా విధేయత చూపిన, క్రీస్తు మన పాపముల నిమిత్తము సిల్వమ్రానుపై చిందించిన పవిత్ర రుధిరంలో శుభ్రపర్చబడి, ఆయన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘములో చేర్చబడుదుము (అ.కార్య. 2:47). ఇదే రక్షణ మార్గము.

—R. చెఖెసాంగ్, నాగాలాండ్.

---

## సంఘ కృషిలో ధన ప్రయోజనము

### (The use of Money in the Work of the Church)

డబ్బులో దానికంటూ యేమీ జీవము లేదు. అది మంచిది గాని చెడ్డది గాని కాదు. అయితే డబ్బును వినియోగించుటలో మనం పరలోకానికో, లేక నరలోకానికో వెళ్తాము (లూకా 19:12-26). అందువలన అన్ని విషయములలోను మనం మంచి గృహ నిర్వాహకులముగా యుండాలి.

యేసు అందరి కొరకు చనిపోయాడు. ఆయన చాల ఘోరమైన మూల్యాన్ని చెల్లించాడు. మనము విలువపెట్టి కొనబడిన వారము (1 కొరింథీ 6:19). గనుక సజీవ యాగముగా మనం మన దేహాన్ని దేవునికి సమర్పించుకోవాలి. అది ఉత్తమమును దేవునికి అనుకూలమునై యున్నట్టిది (రోమా 12:1, 2).

## కీడుకు మూలం

ధనాశవలన అన్ని కీడులు సంభవిస్తాయి (1 తిమో 6 : 10). విశ్వాసమునుండి ప్రజలు తొలగిపోవుటకు అది కారణమౌతాది. ముప్పది వెండి నాణెముల కొరకు ఇస్కరియోతు యూదా యేసు ప్రభువును అప్పగించేసాడు (మత్త 27:3-5). ఇట్టి దురాశవలన నిత్యత్వము వరకు అతనిది చెడ్డపేరుగానే మిగిలిపోతాది. అందువలన యేసు ప్రభువు ఇట్లనుచున్నాడు: "మిక్కిలి కొంచెములో నమ్మకముగా ఉండువాడు ఎక్కువలోను నమ్మకముగా ఉండును; మిక్కిలి కొంచెములో అన్యాయముగా ఉండువాడు ఎక్కువలోను అన్యాయముగా ఉండును. కాబట్టి మీరు అన్యాయపు సిరి విషయములో నమ్మకముగా ఉండని యెడల సత్యమైన ధనమును ఎవరు మీ వశము చేయును? మీరు పరుల సొమ్ము విషయములో నమ్మకముగా ఉండని యెడల మీ సొంతమైనది మీకు ఎవడిచ్చును?...మీరు దేవునిని సిరిని సేవింపలేరు" (లూకా 16:10-13).

పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడని యేసు చెప్పెను (యోహాను 8 : 34). పరిశుద్ధాత్ముడు ఇట్లనుచున్నాడు: "మీరు పాపమునకు దాసులై యుంటిరి గాని యే ఉపదేశక్రమమునకు మీరు అప్పగింపబడితిరో దానికి హృదయ పూర్వకముగా లోబడినవారై పాపమునుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి; ఇందుకు

దేవునికే స్తోత్రము. మీ శరీర బలహీనతను బట్టి మనుష్య రీతిగా మాట లాడుచున్నాను; ఏమనగా అక్రమము చేయుటకై, అపవిత్రతకును, అక్రమమునకును మీ అవయవములను దాసులుగా ఏలాగు అప్పగించి తిరో ఆలాగే పరిశుద్ధత కలుగుటకై యిప్పుడు మీ అవయవములను నీతికి దాసులుగా అప్పగించుడి. మీరు పాపమునకు దాసులై యున్న ప్పుడు నీతి విషయమై నిర్బంధము లేనివారై యుంటిరి. అప్పటి క్రియల వలన మీకేమి ఫలము కలిగెను? వాటిని గురించి మీరిప్పుడు సిగ్గుపడుచున్నారు కారా? వాటి అంతము మరణమే. అయినను ఇప్పుడు పాపమునుండి విమోచింపబడి దేవునికి దాసులై నందున పరిశుద్ధత కలుగుటయే మీకు ఫలము; దాని అంతము నిత్యజీవము. ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసునందు నిత్యజీవము" (రోమా 6:17-23).

## ఆశించరాదు

ప్రభువుకు విధేయుల మవుటద్వారా మనము ఆయనకు దాసులము (రోమా 6 : 16). బాప్తిస్మములో మనం క్రీస్తును ధరించుకొందుము (గలతీ 3:27). మనము విధేయులమైన పిల్లలుగా యుండాలి (1 పేతురు 1:16). మనం ఒకనినొకడు ప్రేమించుటలో తప్ప మరేమియు ఎవనికి అచ్చియుండరాదు (రోమా 13:8). యేసు ప్రభువు మన అపరాధముల మూల్యమును చెల్లించాడు గనుక ఈ లోకానికి ఋణస్థులమై యున్నాము (రోమా 1 : 14). ఈ బాధ్యతను మనం తీవ్రంగానే గైకొనాలి. పొరుగువాని దేనైనను ఆశించుట పాత నిబంధనలో పాపం (నిర్గమ 20:17). ధనాపేక్ష విగ్రహారాధనయని క్రొత్త నిబంధనలో చెప్పబడింది (కొలస్స 3:5). దానిని మనం చంపివేయాలి. చట్టవిరుద్ధంగా కాని సంపాదన ధనాపేక్ష యని నిఘంటువులోని అర్థము.

ధనాపేక్షవలన అబద్ధ బోధకులు తమ బోధను బట్టి లాభము సంపాదింతురు (2 పేతురు 2 : 2, 3). పౌలు ఎఫెసులో బోధించుచుండగా అతడు ఎవరి బంగారమునైనను, వెండినైనను ఆశించలేదు. అతడు పనిచేసుకొన్నాడు. అతడు మనకొక మాదిరి నిచ్చియున్నాడు (అపొ.కా. 20:34, 35). ఈ మాదిరిని తీవ్రంగా అనుసరించిన సహోదరులు మనకున్నారు.

క్రొత్త నిబంధన క్రైస్తవ్య పునరుద్ధరణను గూర్చి అలెగ్జాండరు కేంబెల్ వినినప్పుడు, నిజానికి క్రొత్త నిబంధన యేమి చెప్పుచున్నదో తెలిసికొనేవరకు దాన్ని చదువుతానన్నాడు. దాన్ని తెలిసికొన్న తరువాత తన జీవితకాల మంతయు దాన్ని బోధించాడు. గాని బోధించినందు కతడు ఒక్క పైసా కూడ తీసికోలేదు. T.B. లేరీమోర్ అను మరొక సహోదరుడున్నాడు. "నాకు పెద్దంత డబ్బక్కర్లేదు, అయినా ఎక్కువకాలం నాకది అవసరం లేదని" అతడన్నాడు.

జేమ్స్ హార్డింగ్ అను నతడు తన కాలంలో బహు ప్రసిద్ధి గాంచిన బోధకుడే. కూటములకు రమ్మని ఆహ్వానం రాగా అతడు వెళ్లేవాడు. వారాయన దారి ఖర్చులు ఇయ్యకపోయినను పరవాలేదు. తన కుమారుడొక డాయనతో ఉన్న డబ్బంతా ఖర్చయిపోవుచున్నదని చెప్పాడు. "అయితే మనం సరిపడినంత దేవునికి ఇచ్చుట లేదన్న మాట" అని ఆయన జవాబిచ్చాడు. లూకా 6:38 యేమి చెప్పుచున్నది?

## నిత్య స్వాస్థ్యము

క్రీస్తు పునరుత్థానము వలన మనకు సజీవ నిరీక్షణ యున్నది. అక్షయమైనదియు, నిర్మలమైనదియు, వాడబారనిదియునైన స్వాస్థ్యము మనకున్నది. అది విశ్వాసముద్వారా దేవుని శక్తిచేత కాపాడబడు

చున్నది (1 పేతురు 1:5, 6). క్రీస్తు యేసుయొక్క మంచి సైనికుని వలె మనం శ్రమల ననుభవింపవలసి వస్తాది (2 తిమో 2 : 3). ఆయన వాగ్దానము 2 కొరింథీ 4:17 లో యున్నది.

సంఘమనగా యిది : "యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలుల నర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు, మీరును సజీవమైన రాళ్ళవలె నుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు". "అయితే మీరు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచినవాని గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును పరిశుద్ధ జనమును దేవుని సొత్తయిన ప్రజలై యున్నారు. ఒకప్పుడు ప్రజగా ఉండక యిప్పుడు దేవుని ప్రజ మైతిరి. ఒకప్పుడు కనికరింపబడక యిప్పుడు కనికరింపబడిన వారైతిరి" (1 పేతురు 2:5, 9-10).

విశ్వాసముద్వారా మన పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొందుము. అదంతా దేవుని కృపను బట్టియే (2 పేతురు 1:10).

—జె.సి. బెయిలీ.

---

## సంక్షిప్త వార్తలు

జూన్ నెల సువార్తికుల సమావేశము 24వ తేదీన ప॥గో॥ జిల్లా ఆచంటలో జరిగెను. ఆ సమావేశములో "క్రొత్తనిబంధన ఆరాధనలో వాద్యసంగీతమునకు స్థానము కలదా?" అను అంశము చర్చింపబడెను. ఈ సమావేశమునకు 30 మంది సువార్తికులు ఇంకను స్థానికులు విద్యావంతులు హాజరైరి. ఉదయం జరిగిన సమావేశమునకు సోదరులు పాల్ గూటంగారు అధ్యక్షత వహించగా స్థానికులు డాక్టరు రాంబాబు

గారు చర్చను ప్రారంభించిరి. సోదరులు ఇ కె వి. ప్రసాదరావుగారు మాట్లాడుచు క్రైస్తవులు క్రీస్తు రక్తముచేత కొనబడిన వారని, వారు క్రీస్తు మాట వినవలెనని (మత్త 17:5), క్రొత్తనిబంధన ఆరాధనలో వాద్యసంగీతము ఉండవలెనా? లేదా? అను ప్రశ్నకు జవాబు క్రీస్తు లేక అపొస్తలుల మాటలనుండియే గాని దావీదు మాటలలో నుండి సేకరించవలసిన అవసరం లేదని, క్రొత్తనిబంధన ఆరాధనపై దావీదు నకు గాని మోషేకు గాని అధికారము లేదని, ఒకని అభిప్రాయమునకు కాదు క్రొత్తనిబంధన అధికారమునకు లోబడి యుండవలెనని చెప్పిరి.

సోదరులు S. ఎబినెజరుగారు (పాలకొల్లు) మాటలాడుచు "క్రైస్తవ ఆరాధనలో యాంత్రిక సంగీతమునకు స్థానము లేదని "పాడుట" యే దేవుడిచ్చిన ఆజ్ఞ యని" తెలియజేసిరి. సోదరులు పాల్ గూటంగారు మాటలాడుచు దేవుని వాక్యమే మనుష్యులను ఆకర్షించుకొన శక్తిగలదని నిర్జీవ నాదముద్వారా దేవుడు స్తుతింపబడుట అసాధ్యమని ఆయన చేతులతో సేవింపబడువాడు కాదని" (అ. కా. 17 : 25) తెలియజేసిరి.

మధ్యాహ్న సమావేశమునకు సోదరులు K. ప్రసాద్ గారు (ఆచంట) అధ్యక్షత వహించగా సోదరులు జాషువా గూటంగారు చరిత్రనుండి కొన్ని విషయాలను వెల్లడించిరి. అవేవనగా

1. పాతనిబంధనలో మొట్టమొదట వాయిద్యముల ప్రారంభమును గూర్చి ఆది 4:21లో చదువగలము. కయీను సంతతిలో నుండి వచ్చిన యూబాలు అనునతడు "సితారాను సానిక (పిల్లనగ్రోవి) ను వాడుక చేయు వారికందరికిని మూలపురుషుడు.
2. క్రొత్తనిబంధన వాయిద్యముల విషయమై మౌనముగా నున్నది.
3. క్రీ।శ। 606 లో పోప్ వైటాలిన్ I అను నతడు వారి ఆరాధనలో మొట్టమొదట ఆర్గన్‌ను ప్రవేశపెట్టెను.

"దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను" యోహా 4:24. దేవుడు ఆత్మ, ఆయన పదార్థముకాదు. ఆయన పదార్థము (Matter) తో అనగా వాయిద్య ములతో సేవింపబడువాడు కాదు. ప్రకటన 14వ అధ్యాయములో 'వైణికుల నాదమును పోలియున్నది వారు పాడుచున్న క్రొత్త కీర్తన' అని జాషువా గూటంగారు మంచి పాఠముల నందించిరి.

సాయంకాలం నిర్వహింపబడిన సువార్త దండయాత్రలో సుమారు 15000 కరపత్రికలు పంచిపెట్టబడెను. 4గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. రాత్రి కూటములో సోదరులు జాషువా గూటం గారు 'క్రీస్తు ప్రేమ మరియు విధేయత' అను అంశముపై గొప్ప సువార్త ప్రసంగము నందించిరి. ఇటీవల అమెరికా పర్యటన ముగించు కొని వచ్చిన జాషువా గూటం కవిత దంపతులను సోదరులు అభినం దించిరి. ఆచంటలోను పరిసర ప్రాంతాలలోను గొప్ప పనిని జరిగించు చున్న P. సామ్యూల్ గారు వారి కుమారుడు P. సామ్యూల్ రాజు గారు గొప్ప ఏర్పాట్లు చేసి అనేకులు సువార్త విని ఆనందించుటకు అవకాశము కలుగజేసిరి. ఆచంట పరిసర ప్రాంతాలలో పనిచేయు చున్న సోదరులు ఏకమనస్సుతో పని చేసి గొప్ప ఫలితాలను చూడ గలిగిరి.

* * * *

కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ జూన్ ఆఖరి వారంలో వేసవి సెలవుల అనంతరం తెరువబడి 30 మంది విద్యార్థులతో దిగ్విజయముగా సాగుచున్నది. ఈ సంస్థను పాడుచేయడానికి అపవాది ఎన్ని కుతంత్ర ములను వేసినను దేవుని కృపనుబట్టి స్కూలు చక్కగా నడుచు చున్నది. 1992 డిశంబరు 7 నుండి 13 వరకు జరుగబోయే బైబిలు సెమినార్ విషయమై మీరు ప్రార్థించాలని హాజరవుటకు ఇప్పటి నుండియే సంకల్పించుకోవాలని నెహెమ్యా గూటంగారు తెలియ జేయుచున్నారు.

* * * *

జూలై నెల సువార్తికుల సమావేశము 21వ తేదీ మంగళవారం మాళనపాలెంలో జరిగెను. ఈ సమావేశమునకు 4 జిల్లాల నుండి సువార్తికులు వచ్చి ఈ గొప్ప పరిచర్యలో పాలు పొంది ఆత్మీయా నందములోని మాధుర్యాన్ని రుచిగూడగలిగిరి. ప॥గో॥ జిల్లా మార్టేరు నుండి డా॥ S.V. రావుగారు, విశాఖపట్నం జిల్లా అనకాపల్లి నుండి సోదరులు A. వినయానంద్ గారు (గుడ్ షెఫర్డ్ స్కూల్ ప్రిన్సిపాల్) శ్రీకాకుళం జిల్లా కొమరోలు నుండి T. ప్రకాశరావుగారు మరియు రాజ మండ్రి (కాతేరు) నుండి D. ఆశీర్వాదంగారు వచ్చి తమ విలువైన సందేశమును లేఖనములనుండి అందించి సోదరులను ప్రోత్సహించిరి.

"నేడు పాతనిబంధన క్రైస్తవులకు అమలులోనున్న చట్టమా?" అను అంశము చర్చింపబడెను. ఉదయం జరిగిన సమావేశమునకు సోదరులు వడ్డి చిన్నయ్యగారు అధ్యక్షత వహించగా సోదరులు S. రామకృష్ణారావుగారు చర్చను ప్రారంభించిరి. ఈ చర్చలో ఇంకనూ వడ్డి చిన్నయ్యగారు (కడలి), సోదరులు A. రామమూర్తి గారు (అవిడి) సోదరులు J. ప్రసాద్ గారు (ముంగండ) మరియు P. సమూయేలుగారు (ఆచంట) పాల్గొనిరి. ఈ చర్చలో సోదరులు చర్చించిన ముఖ్యాంశములు ఇశ్రాయేలీయులతో దేవుడైన యెహోవా మోషేద్వారా చేసిన నిబంధన లేక ధర్మశాస్త్రము యూదుల కొరకేగాని క్రైస్తవుల కొరకు కాదని, మోషే ధర్మశా స్త్రము క్రీస్తు శిలువకు మేకులతో కొట్టబడి మన కడ్డము లేకుండ ఎత్తివేయబడినదని అందుచేత క్రైస్తవులు ధర్మశాస్త్రము యొక్క అధికారముక్రింద లేరని, క్రొత్తనిబంధన మాత్రమే నేడు అమలులో నున్న చట్టమని చెప్పిరి.

మధ్యాహ్న సమావేశమునకు సోదరులు K. ప్రసాద్ గారు (ఆచంట) అధ్యక్షత వహించగా రాజమండ్రి (కాతేరు) నుండి వచ్చిన

సోదరులు D. ఆశీర్వాదంగారు ఈ అంశముపై చక్కని సందేశమిచ్చిరి. సోదరులు A. వినయానంద్ గారు మాటలాడుచు, గలతి 4:21-26 ను చక్కగా వివరించిరి.

1. పాతనిబంధన దాసత్వములో పిల్లల నుంచెను.

2. క్రొత్తనిబంధన స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణ నియమము శ్రేష్టమైన, స్వాతంత్ర్యము నిచ్చు నియమము మనకు అమలులో నున్న చట్టము. మనము వారసులము (heirs) దాసులముకాము' అని చెప్పిరి. కొమరోలు నుండి వచ్చిన T. ప్రకాశరావుగారు 'పాతనిబంధన లేవీయులను మాత్రమే యాజకులుగా నుంచినదని, క్రొత్తనిబంధన మనలను ఆత్మ సంబంధమైన బలుల నర్పించే పరిశుద్ధ యాజకులనుగ చేసినదని' మంచి సంగతులు వివరించిరి.

సోదరులు పాల్ గూటంగారు మాటలాడుచు 'మత్త 5:17 లో ధర్మశాస్త్రమును కొట్టివేయుటకు నేను రాలేదని యేసు చెప్పెను. 18వ వచనములో ధర్మశాస్త్రము నెరవేరువరకు దానినుండి పొల్లయినను, సున్నయినను తప్పిపోదని చెప్పెను. ధర్మశాస్త్రము నెరవేర్చబడినప్పుడు జరిగే దేమిటి? లూకా 24:44లో ధర్మశాస్త్రమందు నన్నుగూర్చి వ్రాయబడిన మాటలు నెరవేరినవని చెప్పబడెను. అప్పుడు ధర్మశాస్త్రము ఏమగును? ధర్మశాస్త్రము కొట్టివేయబడెనని బోధించుచున్న సమయములో మతశాఖలవారు ఆందోళన చెందుచున్నారు. దేవుని సంకల్పము ఆ విధంగా ఉంటే యూదులకే లేని ఆందోళన వీరికెందుకు? అని గొప్ప సందేశమిచ్చిరి. సోదరులు జాషువా గూటంగారు మాటలాడుచు పాతనిబంధన నేడు చరిత్రగా చదువవలసిన అవసరమున్నదని బుద్ధికలుగుటకు (1 కొరింధీ 10:11) దీనిని చదవాలని దీనిని అమలులో నున్న చట్టముగా భావించకూడదని చెప్పిరి. తుమ్మపాల నుండివచ్చిన చిన్న ప్రకాశ్ గారు, E.K V. ప్రసాదరావుగారు వర్కుషాప్‌లో పాటలు చక్కగా పాడించి సభకు రక్తి కట్టించిరి.

సువార్త దండయాత్ర జరిగిన పిమ్మట ముగ్గురు క్రీస్తులోనికి పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి. రాత్రి కూటములో సోదరులు డా॥ S.V. రావుగారు (మాస్టేరు) 'దేవుడవరు?' అను గొప్ప సువార్త ప్రసంగము నందించిరి. ఈ ప్రసంగము అనేకులను ఆకర్షించెను. కూటము అనంతరము ప్రజలు తమ గృహాలకు ఆనంద హృదయాలతో తిరిగి వెళ్ళిరి, మాకనపాలెంలో సోదరులు K. ఐజక్ గారు గొప్ప పనిని ప్రభువు కొరకు ఆయన సంఘము కొరకు జరిగించుచున్నారు.

—o—

Regd. No. H/KD—45/KD H.O.

*From*
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To

..............................................

..............................................

..............................................

..............................................